క్లుప్తంగా

భవిత కేంద్రం తనిఖీ

అమలాపురం రూరల్: మండలంలో బండారు లంక భవిత సెంటర్‌ను శుక్రవారం సీఎంఓ బీవీవీ సుబ్రహ్మణ్యం సందర్శించారు. పిల్లల నైపుణ్యాలను పరీక్షించారు. అక్కడ విద్యాబోధనపై ఆరా తీశారు. భవిత ఉపాధ్యాయులకు, విద్యార్థులకు పలు సూచనలు చేశారు. భవిత ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధించే విధానం, వారి పనితీరుపై సంతృప్తి వ్యక్తం చేశారు. భవిత కేంద్రంలో విద్యార్థుల హాజరు పట్టి, వివిధ రికార్డులు పరిశీలించారు. కార్యక్రమంలో భవిత ఉపాధ్యాయులు మోర్త శ్రీనివాసరావు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాల అందజేత

ఉప్పలగుప్తం: ఎన్‌ఎంఎంఎస్ పరీక్షలకు సాధన చేసే విద్యార్థులకు డాక్టర్ వంశీ చైతన్య ఉచితంగా పుస్తకాలు అందించారు. ఈ పుస్తకాలను మండలంలోని గొల్లవిల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం జి.కనకదుర్గ ఆధ్వర్యంలో శుక్రవారం విద్యార్థులకు అందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

హెల్పర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

యానాం: పుదుచ్చేరి, యానాం, మాహే, కారైకల్ రీజియన్లలో విద్యుత్ శాఖలో ఖాళీగా ఉన్న 177 కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు పుదుచ్చేరి నివాసితులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం విద్యుత్‌శాఖ సూపరింటెండెంట్ ఇంజనీర్ కనియాముత్తన్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రూప్-సి నాన్‌గెజిటెడ్, నాన్ మినిస్టీరియల్ లెవెల్-2 పోస్టులైన కన్‌స్ట్రక్షన్ హెల్పర్ పోస్టులకు ఈనెల 13 నుంచి 19వ తేదీ వరకూ దరఖాస్తులు తీసుకుంటామని తెలిపారు. రాత పరీక్ష, అర్హతలు, ఎంపిక విధానం తదితర వివరాలను రిక్రూట్‌మెంట్.పీవై.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో పరిశీలించాలని సూచించారు.

ఉపాధ్యాయులకు సన్మానం



వన్నెచింతలపూడిలో ఉపాధ్యాయులను సత్కరిస్తున్న హెచ్‌ఎం, గ్రామస్తులు

అమలాపురం రూరల్: మండలంలో వన్నెచింతలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులను సత్కరించారు. పీడీ కామన గణేశ్వరరావు, తెలుగు ఉపాధ్యాయుడు పి.ప్రకాష్, వై.సత్యజ్యోతి, ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు పొందిన పరమట విష్ణుప్రసాద్‌లను హెచ్‌ఎం జి.నాగసత్యనారాయణ, ఉపాధ్యాయుల ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. పాఠశాలకు బదిలీపై వచ్చిన అడబాల శ్రీనివాస్, పీడీ పడుచూరి విఘ్నేశ్వరుడు, తెలుగు భాష ఉపాధ్యాయులు మామిడిశెట్టి శ్రీనివాసరావును ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ ఎలిపే ముత్యాల బాబు, ఉపాధ్యాయులు, విద్య కమిటీ సభ్యులు పరమట భీమ మహేష్ పాల్గొన్నారు.

వైద్యులు నన్ను వేధిస్తున్నారు

అమలాపురం టౌన్: స్థానిక ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో డెఫిబ్రిలేటర్ దొంగను తాను పట్టించినందుకు ఆస్పత్రిలోని కొందరు వైద్యులు తనను వేధిస్తున్నారని ఆ ఆస్పత్రి స్టాఫ్ నర్సు సతీ సుమతి వాపోతోంది. ఈ మేరకు రాష్ట్ర మంత్రి వాసంశెట్టి సుభాష్‌కు వినతి పత్రం అందించింది. అమలాపురంలోని క్యాంపు కార్యాలయంలో మంత్రి సుభాష్‌ను స్టాఫ్ నర్సు సతీ సుమతి శుక్రవారం ఉదయం కలిసింది. గత ఏడాది జరిగిన ఈ ఘటనకు సంబంధించి విచారణ చేసిన అధికారులు దొంగను గుర్తించి డెఫిబ్రిలేటర్‌ను తిరిగి ఆస్పత్రికి రప్పించి కేసును రాజీ చేసుకున్నారని పేర్కొంది. అప్పట్లో తాను పోలీసులకు ఫిర్యాదు చేశానని తనపై కక్ష కట్టి వేధిస్తున్నారని మంత్రికి తెలిపింది. తనపై తప్పుడు ఫిర్యాదులు చేసి విధులకు హాజరు కాకుండా అడ్డుకుంటున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేసింది.

అక్రమ రవాణా నివారణకే స్మార్ట్ కార్డులు

ముమ్మిడివరం: అక్రమ రవాణా అరికట్టి లబ్ధిదారులకు సక్రమంగా రేషన్ సరుకులు అందించడానికే స్మార్ట్ కార్డులు దోహద పడతాయని ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రం ముమ్మిడివరం, ఐ.పోలవరం, కాట్రేనికోన, మండలాల్లో స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెల్లి వివేకానంద, గుత్తలు సాయి, తాడి నరసింహరావు, అర్థాని శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

అమలాపురం రూరల్: ఇమ్మిడివరప్పాడు పంచాయతీ వద్ద శుక్రవారం అమలాపురం రోహిణి తల్లీపిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ వైద్య శిబిరాన్ని శుక్రవారం సర్పంచ్ రేలంగి దుర్గారావు ప్రారంభించారు. శిబిరంలో చిన్న పిల్లల వైద్య నిపుణుడు డాక్టర్ వీఎస్‌ఎస్‌ఎన్ మూర్తి చిన్నపిల్లలకు వైద్య పరీక్షలు చేసి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. అనంతరం సర్పంచ్ దుర్గారావు డాక్టర్ మూర్తిని ఘనంగా సన్మానించి ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో వంకాయల ప్రసాద్, శ్రీకాకుళపు సత్యనారాయణ, ఆర్.రాజు, ఎం.రాజేష్, సీహెచ్ చిరంజీవి, ఎన్.రాజు, కె.నాగేంద్ర, ఎం.మహాలక్ష్మి పాల్గొన్నారు.

ముందుకు సాగుదాం

- ఖర్చు తగ్గించి, పంటల ఉత్పత్తి పెంచడమే లక్ష్యం
- సత్ఫలితాల దిశగా పొలం పిలుస్తోంది



చిందాడగరువులో రైతులకు నూతన విధానాలపై అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ అధికారి ప్రవీణ్



పాలగుమ్మిలో పొలం పిలుస్తోంది కార్యక్రమంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

అమలాపురం రూరల్: సాగులో కొత్త విధానాలు అవలంబిస్తేనే మంచి దిగుబడి సాధించవచ్చు. లాభాలు పొందవచ్చు. వ్యవసాయంలో మారుతున్న సాంకేతిక మార్పులు అన్ని రంగాలపైనా ప్రభావం చూపుతున్నాయి. వాటికి అనుగుణంగా ఎప్పటికప్పుడు అందిపుచ్చుకుంటేనే ముందుకు వెళ్లితే లాభాలు ఆర్జించగలం. వ్యవసాయ రంగంలో అదే ఒరవడి నడుస్తోంది. ఈ దిశగా రైతులను సంసిద్ధులను చేసేందుకు వ్యవసాయశాఖ 'పొలం పిలుస్తుంది' కార్యక్రమాలు నిర్వహిస్తోంది. పొలం, తోటల్లో పాఠాలు చెప్పడం వల్ల రైతులు ఆ దిశగా సత్ఫలితాలు పొందుతున్నారు. అమలాపురం నియోజకవర్గంలో అమలాపురం, అల్లవరం, ఉప్పలగుప్తం మండలాల్లో ఖరీఫ్ సాగులో పొలం పిలుస్తుందిలో యాజమాన్య పద్ధతులపై అవగాహన కలిస్తున్నారు. సాగు ప్రారంభం నుంచి నారుమడులు వేసి నాటి నుంచి వరినాట్లు ప్రారంభం దశలో రైతులను సాగు సన్నద్ధం చేసేందుకు సమావేశాలు నిర్వహించారు. తొలుత సాగు విస్తీర్ణం అంచనా వేసేందుకు కౌలు రైతులను గుర్తించి వారికి సాగు హక్కు పత్రాలు ఇచ్చేందుకు గ్రామ సభలు నిర్వహించారు. వ్యవసాయంలో అధిక పెట్టుబడులు పెట్టి నష్టపోతున్న రైతులకు సస్యరక్షణ, యాజయాన్య పద్ధతులపై అవగాహన కల్పించేందుకు గ్రామాల్లోనూ పొలం పిలుస్తోంది కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. మండలంలో ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకుని ఆ గ్రామంలో 25 నుంచి 30 ఎకాలల్లో రైతులకు ఆధునిక యాజమాన్య పద్ధతులపై ఔత్సాహిక రైతులకు ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తున్నారు. అమలాపురం మండలంలో చిందాడగరువులో అల్లవరం, గూడాల, ఉప్పలగుప్తం మండలంలోని గొల్లవిల్లి గ్రామాల్లో ఖరీఫ్‌లో వ్యవసాయ సహాయకులు, మండల వ్యవసాయ అధికారులు, ఏడీఏ, వ్యవసాయ పరిశోధన శాస్త్రవేత్తలు, అధికారులతో శిక్షణ తరగతులు ఇస్తున్నారు. మంగళవారం, బుధవారం పొలం పిలుస్తోంది, శనివారం పొలంబడి కార్యక్రమం ఆయా మండలాల్లో గ్రామాల్లో అవగాహన కలిగించి ఆధునిక వ్యవసాయ పరిజ్ఞానాన్ని అందించేలా కృషి చేస్తున్నారు.

నియోజకవర్గంలో పరిధిలో సాగు వివరాలు

మండలం	ఎకరాల్లో వరిసాగు
అమలాపురం	4,577
అల్లవరం	2,900
ఉప్పలగుప్తం	4.460

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన

సాగులో అధిక ఎరువులు, పురుగు మందులను విచక్షణ రహితంగా వాడడంతో విష, రసాయన అవశేషాలు ఆహార పదార్థాల్లో ఉండిపోతున్నాయి. వీటి వినియోగాలతో రోగాలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటిని నివారించేందుకు సేంద్రియ ఎరువులను వినియోగిస్తూ ప్రకృతి పద్ధతులతో భూ సారాన్ని పెంచడంతో పాటు ఆరోగ్యకరమైన పంటలు సాగు చేసేలా అవగాహన కల్పిస్తున్నారు.

తక్కువ ఖర్చు.. అధిక దిగుబడి

మెరుగైన సేవలు క్షేత్రస్థాయిలో పంటల పరిశీలనతో పాటు, ఎరువులు, నీటి యాజమాన్యంపై రైతులకు అవగాహన కల్పించడమే ధ్యేయంగా వ్యవసాయాధికారులు ప్రతి వారం ఎంపిక చేసిన గ్రామాల్లో పొలం పిలుస్తోంది నిర్వహిస్తున్నారు. ఆధునిక పద్ధతుల్లో సేద్యంపై శిక్షణ ఇస్తున్నారు. మిశ్రమ ఎరువుల వినియోగం, సేంద్రియ ఎరువుల వినియోగాన్ని పెంచడం, సేంద్రియ వ్యవసాయం, శత్రు, మిత్ర పురుగుల గుర్తింపు, ఆధునిక పద్ధతిలో పంటసాగుపై రైతులకు అవగాహన కల్పించేందుకు బ్యాలెట్ బాక్స్ పరీక్ష నిర్వహిస్తున్నారు. ఆరోగ్యకర పంటలను పండించడం అన్నదాతలను సాగులో నిష్ణాతులను చేయడం, మిత్ర పురుగులను సంరక్షించడం వంటి ప్రధాన లక్ష్యాలతో వీటిని నిర్వహిస్తున్నారు. ఆయా గ్రామాల్లో వ్యవసాయ సహాయకులు ఆధ్వర్యం వహిస్తున్నారు.

దిగుబడి పెంచడమే లక్ష్యం



నూతన యాజమాన్య పద్ధతులను తెలుసుకునేందుందుకు రైతులు ఆసక్తి చూపిస్తున్నారు. క్షేత్రస్థాయిలో చేను పరిస్థితి అంచనా వేయడంతో పాటు కొత్తగా ఏమైనా తెగుళ్లు ఆశిస్తే వాటిని నివారించే విధానాన్ని తెలియజేస్తున్నాం. సాగు ఖర్చు తగ్గించి పంట దిగుబడిని పెంచడమే లక్ష్యంగా పొలంబడి నిర్వహిస్తున్నాం.

– ప్రవీణ్, మండల వ్యవసాయ అధికారి, అమలాపురం

స్పాట్ వాల్యుయేషన్ పారితోషికం చెల్లించండి



డీఐఈవోకు వినతిపత్రం అందిస్తున్న ఇంటర్మీడియెట్ గణిత అధ్యాపకులు

అమలాపురం టౌన్: గత మార్చి నెలలో జరిగిన ఇంటర్మీడియెట్ మ్యాథమెటిక్స్ స్పాట్ వాల్యూయేషన్‌కు సంబంధించి చెల్లించాల్సిన పారితోషికం నేటికీ చెల్లించలేదని ఈ పాఠ్యాంశ అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై సంబంధిత అధికారులకు ఎన్నిసార్లు చెప్పుకున్నా ఫలితం లేకపోయిందని అంటున్నారు. అధికారులు ఏవేవో కారణాలు చెబుతున్నారే తప్ప తమకు రావాల్సిన బకాయిలు చెల్లించడం లేదని ఇంటర్మీడియెట్ గణిత అధ్యాపకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మిగిలిన పాఠ్యాంశాల పేపర్ల స్పాట్ వాల్యుయేషన్‌కు సంబంధిత అధ్యాపకులకు పారితోషికాలు ఇచ్చేసినప్పటికీ కేవలం మ్యాథమెటిక్స్ అధ్యాపకులకు ఇవ్వకపోవడంపై వారు అసహనానికి గురవుతున్నారు. జిల్లా వ్యాప్తంగా 75 మంది అధ్యాపకులు ఉన్నారని చెబుతున్నారు. ఒక్కొక్కరికి రూ.15 వేల నుంచి రూ.20 వేల వరకూ మొత్తం రూ.19 లక్షల వరకూ రావాల్సి ఉందని తెలిపారు. అమలాపురంలో డీఐఈవో వనుము సోమశేఖరరావును అధ్యాపకులు శుక్రవారం కలిసి ఈ మేరకు వినతిపత్రం అందించి తమ బకాయి పారితోషికాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. అధ్యాపకులు జి.వెంకటేశ్వరరావు, పి.లోవప్రసాద్, సతీష్, పార్వతి, నాయుడు, ప్రసన్న తదితరులు డీఐఈవోను కలసిన వారిలో ఉన్నారు.

పవర్‌లిఫ్టింగ్ నూతన కార్యవర్గం



పవర్‌లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ప్రతినిధులతో ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు

అమలాపురం టౌన్: గొల్లగూడెంలోని కుడుపూడి గోపాలకృష్ణ గోఖలే ఐపీఎస్ మెమోరియల్ జిమ్‌లో ఆ జిమ్ పేరిట పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ నూతన కార్యవర్గం ఏర్పాటైంది. ఈ అసోసియేషన్‌కు గౌరవాధ్యక్షుడిగా ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు ఎంపికయ్యారు. అసోసియేషన్ అధ్యక్షుడిగా ముంగర ప్రసాద్, ఉపాధ్యక్షుడిగా ఎస్‌ఎంకే రెడ్డి, కార్యదర్శిగా చీకురుమిల్లి కిరణ్‌కుమార్, ఉప కార్యదర్శిగా వాడ్రేవు భరత్‌కుమార్, కోశాధికారిగా పితాని మానేశ్వరరావు, అసోసియేషన్ సభ్యులుగా జీఎస్‌ఎన్ మూర్తి, సంసాని వెంకట రత్నకుమార్, విత్తనాల శివప్రసాద్, మట్టపర్తి రామకృష్ణ, గుబ్బల ఉదయ్ భాస్కర్, వాసంశెట్టి చినబాబు నియమితులయ్యారు. ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు మాట్లాడుతూ ఈ జిమ్ నుంచి అనేక మంది స్టేట్ యూనివర్శిటీ, నేషనల్ బాడీ బిల్డర్లు, పవర్ లిఫ్టర్లు, వెయిట్ లిఫ్టర్లుగా ఎదిగారని గుర్తు చేశారు. వీరే నేడు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల్లో ఉద్యోగాలు చేస్తూ అమలాపురం కీర్తి పతాకాలు ఎగురవేస్తున్నారని చెప్పారు. అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు అభినందించారు.

జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేయాలి

వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూర్యప్రకాష్



జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు సూర్య ప్రకాష్‌ను సత్కరిస్తున్న పార్టీ నాయకులు

అమలాపురం రూరల్: 2029 ఎన్నికల్లో జగన్ మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రి చేయడంలో యువజన విభాగం పాత్ర చాలా కీలకమని.. పార్టీ యువజన విభాగం కంకణం కట్టుకుని విజయం కోసం పనిచేయాలని వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు పిల్లి సూర్య ప్రకాష్ పిలుపునిచ్చారు. అమలాపురం మండలం భట్నవిల్లి పార్లమెంట్ నియోజకవర్గం కోఆర్డినేటర్ పినిపే విశ్వరూప్ నివాసంలో అమలాపురం నియోజకవర్గం వైఎస్సార్ సీపీ పట్టణ, మండల, జిల్లా, నియోజకవర్గ యువజన విభాగ అనుబంధ అధ్యక్షులు, సభ్యులతో సమావేశం నిర్వహించారు. సమావేంలో సూర్యప్రకాష్ మాట్లాడుతూ పార్టీ నాయకులు కూటమి ప్రభుత్వం అక్రమాలపై ఉద్యమం చేయాలని అన్నారు. సమావేశంలో రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, అమలాపురం పట్టణ అధ్యక్షుడు సంసాని నాని, యువజన విభాగం ప్రతినిధులు దూడల ఫణి, విత్తనాల మూర్తి, ములపర్తి శ్రీను, యాళ్ల చిన్న, దొంగ బాలాజీ, పట్టణ, రూరల్, అల్లవరం, ఉప్పలగుప్తం యువజన విభాగం అధ్యక్షులు కల్వకొలను ఉమ, కేత భానుతేజ, బళ్ల శ్యామ్, ఓగూరి విజయ్‌కుమార్, శిరీష్ తదితరులను సత్కరించారు.

నకిలీ డాక్యుమెంట్లతో మోసం



తాళ్లరేవు తహసీల్దార్ కార్యాలయం వద్ద తమ గోడు వెళ్లబోసుకుంటున్న జి.వేమవరం గ్రామస్తులు

తాళ్లరేవు: జి.వేమవరం గ్రామ పంచాయతీలో నకిలీ డాక్యుమెంట్లను సృష్టించి పలువురిని ఇబ్బందులకు గురిచేస్తున్న అనుకూలి బాబూరావు, అనుకూలి శ్రీనివాసరావు అనే ఇద్దరి వ్యక్తులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేశారు. శుక్రవారం పలువురు రైతులు తమకు జరిగిన అన్యాయంపై తహసీల్దార్ పితాని త్రినాథరావుకు ఫిర్యాదు చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ ఎల్‌పి నెం.1,880లో గండి వెంకటపతి వారి కుటుంబసభ్యుల వ్యవసాయ భూమి, ఎల్‌పి నెం.1892 పుణ్యమంతుల శంకరరావు, కృష్ణమూర్తి, పాపయ్య, సత్యనారాయణలకు చెందిన భూమిపై కుటుంబ సభ్యులకు తెలియకుండా సంతకాలు చేయించుకుని కబ్జా చేయడానికి ప్రయత్నాలు చేస్తున్నారని ఆరోపించారు. పలువురు ప్రజా ప్రతినిధుల పేర్లను వాడుకుంటూ ఈ మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గతంలో ఇదే విధంగా పలువురిని మోసగించడంతో మానసిక వ్యథతో మృతి చెందారని తెలిపారు. నకిలీ డాక్యుమెంట్లతో మోసాలకు పాల్పడుతున్న వారిపై చర్యలు చేపట్టాలని స్థానిక నాయకులు గండి అనిల్, గండి సత్యనారాయణ, రైతులు పుణ్యమంతుల కృష్ణమూర్తి, జి.సూర్యకళ, గండి పెదవెంకటపతి, పి.కృష్ణమహేష్ కోరారు.

వేణుగోపాలస్వామికి సన్మానం



వేణుగోపాలస్వామిని సన్మానిస్తున్న ఎంపీపీ శేషగిరిరావు తదితరులు

అల్లవరం: పాఠశాలను అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తూ, పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించి జిల్లా ఉత్తమ ప్రధానోపాధ్యాయుడిగా అవార్డు దక్కించుకున్న దేవగుప్తం ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వేణుగోపాలస్వామి ఉపాధ్యాయ వృత్తికే ఆదర్శప్రాయుడని ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు అన్నారు. దేవగుప్తం ఉన్నత పాఠశాలలో శుక్రవారం ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతకు పుర ప్రముఖులు, ఉపాధ్యాయులు ఘన సన్మానం నిర్వహించారు. పలువురు మాట్లాడుతూ దేవగుప్తం ఉన్నత పాఠశాలని ఎంతో సుందరకరంగా తీర్చిదిద్దారని, విద్యార్థుల్లో ఉత్తీర్ణత శాతాన్ని పెంచడంలో ఆయన కృషి ఎంతో ఉందన్నారు. అనంతరం వేణుగోపాలస్వామి దంపతులను పూలమాలలు, శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో కుడుపూడి సూర్యప్రకాశరావు, గుబ్బల నాగేశ్వరరావు, కొప్పిశెట్టి రామకృష్ణారావు, తిక్కా లక్ష్మణరావు, పోతుమూడి సురేష్, రోహిణి శ్రీను, ఉపాధ్యాయులు అప్పారి శ్రీనివాస్, జి.వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

మడ అడవులను పరిరక్షించాలి



సమావేశంలో మడ అడవుల అన్యాక్రాంతంపై ప్రశ్నిస్తున్న వైస్ ఎంపీపీ నాగేంద్రప్రసాద్

తాళ్లరేవు: ప్రజలు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై సభ్యులు ధ్వజమెత్తారు. శుక్రవారం స్థానిక మండల ప్రజా పరిషత్ సమావేశపు హాలులో ఎంపీపీ రాయుడు సునీత అధ్యక్షతన మండల పరిషత్ సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వైస్ ఎంపీపీ ధూళిపూడి నాగేంద్రప్రసాద్ మాట్లాడుతూ మడ అడవులు ఆక్రమించి ఆక్వా చెరువులుగా మారుస్తున్నారని, వాటిని పరిరక్షించాలని కోరారు. వేసవిలో సాగునీటి ఎద్దడి పేరుతో ఏటా సుమారు రూ.10 లక్షలకుపైగా నిధులు దుర్వినియోగమవుతున్నాయని, సమస్య పరిష్కారం కోసం రెండు పంప్‌హౌస్‌లు నిర్మిస్తే శాశ్వత పరిష్కారం లభిస్తుందని తెలిపారు. ఇంజరం ఎంపీటీసీ సభ్యురాలు కోరుకొండ కిరణ్‌కుమారి మాట్లాడుతూ ఇంజరం వంతెన నిర్మించకపోవడంతో రైతులు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అరటికాయలంక వంతెన శిథిలస్థితికి చేరుకుందని, నూతన వంతెన నిర్మించాలని కోరారు. పోలేకుర్రు పంచాయతీలో అంగన్‌వాడీ కేంద్రాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయని, ప్రభుత్వ భవనాలు నిర్మించాలని సర్పంచ్ వెంటపల్లి నూకరాజు కోరారు. కోరంగి సర్పంచ్ పెయ్యల మంగేష్ మాట్లాడుతూ పంచాయతీ పరిధిలోని మహిళా మార్ట్ సభ్యులు అద్దె, కరెంటు బిల్లు తక్షణమే చెల్లించాలని కోరారు. సభ్యులు లేవనెత్తిన సమస్యలను పరిష్కరించాలని ఎంపీపీ రాయుడు సునీత అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో వైస్ ఎంపీపీ కొపనాతి లలిత ఎంపీటీసీ సభ్యులు, పలువురు సర్పంచ్‌లు, అధికారులు హాజరయ్యారు.

మల్లాడి కొత్త పార్టీ ప్రారంభంపై కథనాలు

మత్స్యకార ప్రభావిత 5 నియోజకవర్గాల్లో పోటీ

యానాం: పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి, మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు కొత్త పార్టీ ప్రారంభించాలని నిర్ణయించారని శుక్రవారం పుదుచ్చేరి నుంచి వెలువడే పలు ప్రధాన తమిళ పత్రికల్లో కథనాలు ప్రచురితం కావడం యానాంలో చర్చనీయాంశమైంది. యానాం నియోజకవర్గం నుంచి 5 సార్లు శాసనసభ్యుడిగా గెలవడంతో పాటు రెండుసార్లు పుదుచ్చేరి కేబినెట్ మంత్రిగా మల్లాడి పనిచేశారు. పర్యాటక, రెవెన్యూ, ఆరోగ్యమంత్రిగా, మత్స్యకార నాయకుడిగా ఆయన సేవలు అందించారు. ఈ నేపథ్యంలో ఆయన 2021 అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయకుండా యానాం నియోజకవర్గంలో ప్రస్తుత సీఎం రంగసామిని నిలబెట్టారు. అనూహ్యంగా 28 ఏళ్ల యువకుడు గొల్లపల్లి శ్రీనివాస్‌అశోక్ చేతిలో ఆయన ఓటమి చెందారు. అనంతరం నియోజకవర్గాన్ని త్యాగం చేసినందుకు కృతజ్ఞతగా సీఎం రంగసామి మల్లాడి కృష్ణారావుకు పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి పదవిని కట్టబెట్టారు. వచ్చే ఏడాది 2026 ఏప్రిల్‌లో పుదుచ్చేరి అసెంబ్లీకి ఎన్నికలు నిర్వహించనున్నారు. దీంతో ఆయన పుదుచ్చేరి తీరప్రాంత మత్స్యకారులు అధికంగా ఉండే 5 నియోజకవర్గాల్లో తన మద్దతుదారులను పోటీకి నిలబెట్టి ప్రభుత్వ ఏర్పాటులో కీలకపాత్ర వహించాలని ఇప్పటికే పలు సందర్భాల్లో ఆయన పలు వేదికలపై చెబుతున్నారు. పుదుచ్చేరిలోని మనకలపట్టు, రాజ్‌భవన్, ముత్యాలపేట, ఉప్పలం, అరియకుప్పం తదితర నియోజకవర్గాల్లో తన అభ్యర్థులను పోటీకి దింపాలని నిర్ణయించి, ఇప్పటి నుంచే ఆయా మత్స్యకార నేతలతో నిరంతరం ఆయన సంప్రదింపులు జరుపుతున్నారని పలువురు చర్చించుకుంటున్నారు.

ప్రైవేటీకరణకు నిరసనగా 'సేవ్ ఆర్టీసీ డే'



ధర్నా చేస్తున్న ఉద్యోగులు

అమలాపురం రూరల్: విద్యుత్ బస్సుల పాలసీ పేరుతో ఆర్టీసీలను ప్రైవేటీకరణ చేయడాన్ని నిరసిస్తూ అఖిలభారత ట్రాన్స్‌పోర్ట్ వర్కర్ల ఫెడరేషన్ పిలుపు మేరకు సేవ్ ఆర్టీసీ డేలో భాగంగా అమలాపురం డిపోలో యునైటెడ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శుక్రవారం ధర్నా నిర్వహించారు. విద్యుత్ బస్సుల పాలసీ పేరుతో కేంద్ర ప్రభుత్వం ఎలక్ట్రిక్ బస్సులను రాష్ట్రాలకు కేటాయించి విధివిధానాలను ప్రభుత్వరంగ సంస్థలైన ఆర్టీసీలతో సంబంధం లేకుండా ప్రైవేటు కన్సార్టియంతో బస్సులు నిర్వహించాలని బస్సుల్లో సిబ్బందిని ప్రైవేటు వారే నియమించుకోవచ్చని తెలిపిందన్నారు. యూనియన్ జిల్లా కార్యదర్శి వంక గణపతి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు మొత్తం నేరుగా ఆ ప్రైవేటు సంస్థలకి చెందే విధంగా ప్రకటించారు. దీని వల్ల ప్రభుత్వ రంగంలో దేశ వ్యాప్తంగా ఉన్న 58 ఆర్టీసీలు త్వరలో మూతపడే అవకాశం ఉందన్నారు. వ్యాపార దృక్పథంతో పనిచేసే ప్రైవేటు కన్సార్టియంలు కార్మికులకు సరైన జీతాలు ఇవ్వకుండా, ప్రజల వద్ద నుండి టికెట్ల రూపంలో భారీగా వసూళ్లు చేయడం వల్ల ప్రజలకు తీవ్ర నష్టం కలిగే అవకాశం ఉందన్నారు. ప్రభుత్వ రంగ ఆర్టీసీలకు మరణ శాసనంగా ఉన్న జీవో నంబర్ 88ను రద్దు చేయాలని, ఎలక్ట్రిక్ బస్సులను ప్రభుత్వ రంగ ఆర్టీసీ సంస్థల ద్వారానే నిర్వహించాలని, సంబంధిత సబ్సిడీలను ఆర్టీసీకే కేటాయించాలని ఉద్యోగులు కోరారు. యునైటెడ్ వర్కర్ల యూనియన్ జిల్లా ఉప కార్యదర్శి కె.రంగ ప్రసాద్, కె.భీమేశ్వరరావు, కేవీరావు, కోటేశ్వరరావు, కె.రాంబాబు పాల్గొన్నారు.

రసాయన శాస్త్రంపై ఓరియంటేషన్

అమలాపురం టౌన్: ఇంటర్మీడియెట్ విద్యా బోధనలో చేపడుతున్న సంస్కరణల్లో భాగంగా స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో రసాయన శాస్త్రం పాఠ్యాంశంపై జిల్లాలోని అధ్యాపకులకు శుక్రవారం పునశ్చరణ కార్యక్రమం నిర్వహించినట్లు డీఐఈవో వనుము సోమశేఖరరావు తెలిపారు. అమలాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకురాలు వి.నాగలక్ష్మి రసాయన శాస్త్ర అధ్యాపకులకు శిక్షణ ఇచ్చారు. నూతన సిలబస్, మార్పులు, పరీక్షా విధానం, పోటీ పరీక్షలకు విద్యార్థులను సంసిద్ధం చేయడం తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమాన్ని డీఐఈవో సోమశేఖరరావు సందర్శించి అధ్యాపకులకు పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సరికొత్త అభ్యాసనతో విద్యార్థులకు ఎలాంటి విద్యా బోధన చేయాలి? ఎలాంటి ఫలితాలను సాధించాలనే అంశాలపై ఆయన సూచించారు.

వేంకటేశ్వరస్వామి దేవస్థానం చైర్మన్‌గా అబ్బులు



అమలాపురం టౌన్: కోనసీమ పెళ్లిళ్ల వెంకన్నగా పేరుగాంచిన అమలాపురం వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలిని ప్రభుత్వం నియమించింది. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా కంచిపల్లి సత్యనారాయణ (అబ్బులు) నియమితులయ్యారు. ధర్మకర్తలుగా దంగేటి విజయగౌరి, కొమ్ముల ఆదిబాబు, డి.వెంకట సత్యజయలక్ష్మి, మట్టపర్తి గౌరీపార్వతి, వెన్నా మాణిక్యాంబ, మోకా కళ్యాణి దుర్గమాణిక్యాంబ, కుంచే అరుణకుమారి, కల్లేపల్లి ప్రసాద్, పట్నాల వెంకటరమణ, మల్లికార్జునరావు, గోకరకొండ లక్ష్మణరావులు నియమితులయ్యారు.

సమస్యలపై చలో కలెక్టరేట్

అమలాపురం రూరల్: ఉన్నత చదువులు చదువుకుని ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్న ఆటో కార్మికులు ప్రభుత్వం వల్ల రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని కోనసీమ జిల్లా ఆంధ్ర ఆటో యూనియన్ అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు అన్నారు. చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. 11 డిమాండ్లతో కూడిన మెమొరాండాన్ని కలెక్టరేట్ ఏవో విశ్వేశ్వరరావుకు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ఉటాల వెంకటేష్, ఆటో యూనియన్ కోశాధికారి మోకా శ్రీనివాసరావు, డివిజన్ అధ్యక్షుడు బొలిశెట్టి శంకరం, కార్యదర్శి బొక్క నాని, ట్రెజరర్ బొమ్మి ఫణేంద్ర, నాయకులు చేగోడు పెద్దిరాజు, కార్మికులు పాల్గొన్నారు.

లౌకిక విలువల కోసం పోరాడిన ఏచూరి

అమలాపురం టౌన్: కమ్యూనిస్ట్ జాతీయ నేత దివంగత సీతారాం ఏచూరి లౌకిక విలువల కోసం పోరాడిన అభ్యుదయ నేతని సీపీఎం పార్టీ జిల్లా కన్వీనర్ కారెం వెంకటేశ్వరరావు అన్నారు. సీతారామ్ ఏచూరి ప్రథమ వర్ధంతి సందర్భంగా స్థానిక గొల్లగూడెంలోని జిల్లా ప్రజా సంఘాల కార్యాలయంలో శుక్రవారం జరిగిన వర్ధంతి సభలో వెంకటేశ్వరరావు మాట్లాడారు. పలు ప్రజా సంఘాల నాయకులు తొలుత సీతారాం ఏచూరి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సీపీఎం పార్టీ నాయకులు, దళిత సంఘాల నాయకులు ఏచూరి సేవలను కొనియాడి ఘన నివాళులర్పించారు.

బాలిక మృతికి వేధింపులే కారణం

అమలాపురం టౌన్: అల్లవరం మండలం దేవగుప్తం గ్రామానికి చెందిన మైనర్ బాలిక ఆత్మహత్య చేసుకుని మృతి చెందడానికి ప్రేమ పేరుతో ఆ బాలికను వేధించిన యువకుడే కారణమని మానవ హక్కుల వేదిక ప్రతినిధులు తెలిపారు. ఆ వేదిక ప్రతినిధుల బృందం ఆ గ్రామాన్ని సందర్శించి మృతురాలి తల్లిని, ఇతర కుటుంబాల సభ్యులను కలసి శుక్రవారం మాట్లాడింది. ఈనెల ఒకటిన బాలిక పురుగుమందు తాగింది. అదే రోజు అమలాపురంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్సకు చేర్చారని వేదిక ప్రతినిధులు తెలిపారు. మానవ హక్కుల వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై.రాజేష్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎ.రవి, జిల్లా అధ్యక్షుడు మహ్మద్ ఇక్బాల్ గ్రామంలో నిజ నిర్ధారణ చేశారు. మెరుగైన వైద్యం కోసం బాలికను కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందిందన్నారు. పోలీసులు ఎలాంటి ఒత్తిళ్లకు గురికాకుండా నిందితుడిపై చర్యలు తీసుకోవాలని నిజ నిర్ధారణ బృందం సూచించింది.

కాకినాడ జిల్లాకు నాయకర్ పేరు పెట్టాలి

తాళ్లరేవు: మహాదాత, విద్యాప్రదాత మల్లాడి సత్యలింగం నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక అంబేడ్కర్ భవన్‌లో మాజీ ఎంపీపీ ఎంజీ సూర్యనారాయణ అధ్యక్షతన రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. అగ్నికుల క్షత్రియ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బొడ్డు సత్యనారాయణ మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాలకు విద్యను అందించేందుకు తాను కష్టించి సంపాదించిన యావదాస్తిని దానం చేసిన సత్యలింగం నాయకర్ పేరును కాకినాడ జిల్లాకు పెట్టాలని కోరారు. ఎంపీపీ రాయుడు సునీత, జెడ్పీటీసీ సభ్యులు దొమ్మేటి సామ్యూల్ సాగర్, అగ్నికుల క్షత్రియ ఐక్య మహాసభ అధ్యక్షుడు వైదాడి నూకరాజు, అఖిలపక్ష నాయకులు, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

17, 18 తేదీల్లో క్రీడా పోటీలు

అయినవిల్లి: మండల స్థాయిలో జరిగే క్రీడా పోటీలు ఈ నెల 17, 18 తేదీల్లో జరుగుతాయని శుక్రవారం నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. మండల స్థాయి క్రీడా పోటీల్లో ముక్తేశ్వరం జెడ్పీ ఉన్నత పాఠశాల, మండలంలోని ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఈ పోటీలు నిర్వహిస్తారు. క్రీడా పోటీల్లో వాలీబాల్, కబడ్డీ, బ్యాడ్మింటన్, యోగా, చెస్, అథ్లెటిక్స్ వంటి క్రీడలు ఉంటాయన్నారు. ఈ పోటీల్లో విజేతలను కొత్తపేట డివిజన్ కేంద్రంలో జరిగే పోటీలకు ఎంపిక చేస్తామని నిర్వాహకులు తెలిపారు.